రుద్రంగిని మరింత అభివృద్ధి చేస్తాం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ₹కోటీ 43లక్షలతో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమిపూజ

రుద్రంగి: మండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖాన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

రుద్రంగి, జూలై 7: మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, అధికారులతో కలిసి మండల కేంద్రంలో ₹కోటీ43 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు. రుద్రంగిలో 30పడకల ప్రభుత్వ దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని గండి వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి నాగారం చెరువుకు గల కాలువ పనులను కలెక్టర్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాలువపై బ్రిడ్జి నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, డీఈ పవనకుమారి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, తహసీల్దార్ మహ్మద్ శ్రీలత, ఎంపీడీవో నటరాజ్, మండల వైద్యాధికారి సంపత్, ఎస్ఐ అశోక్, ఎంపీవో సుధాకర్, ఏఈ మనోహర్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్, తర్రె మనోహర్, మోహన్‌రెడ్డి, అభిలాష్, యాదయ్య, నర్సారెడ్డి, లచ్చిరెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో మెరుగైన వసతులు

వేములవాడ రూరల్, జూలై 7: ప్రభుత్వ విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మర్రిపల్లి గ్రామంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ₹16లక్షల అంచనాతో ఎనిమిది టాయిలెట్ల నిర్మాణానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే కోరుట్ల-వేములవాడ రహదారిపై వంతెన పనులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాశ్, జిల్లా అధికారులు, కస్తూర్బాగాంధీ విద్యాలయ బాధ్యులు, తదితరులు ఉన్నారు.

గోవిందరాజుల స్వామి సన్నిధిలో విప్

చందుర్తి, జూలై 7: సనుగులలోని శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజుల స్వామివారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు విప్‌కు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఇక్కడ ఏగోళం శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, రామిని సాయికృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

జిల్లాలో మహిళా శక్తి క్యాంటీన్లు

- సిరిసిల్ల, వేములవాడలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు

రాజన్న సిరిసిల్ల, జూలై 7 (నమస్తే తెలంగాణ): ఆర్థిక పురోగతి సాధించి వ్యాపార వేత్తలుగా ఎదగాలన్న ఆకాంక్షతో మహిళలు కొత్తకొత్త వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన చేయూతతో వివిధ కుటీర పరిశ్రమలు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. కులవృత్తుల నుంచి మొదలుకుని కోళ్ల ఫారాలు, మినీ రైస్ మిల్లులు, కిరాణ దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టిఫిన్ సెంటర్లు, చాయ్‌హోటళ్ల, బిర్యానీ సెంటర్లకు డిమాండ్ పెరిగింది. కాగా, కొత్త జిల్లాల ఆవిర్భావంతో అన్నిశాఖల కార్యాలయాలు ఏర్పాటు కావడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్లేవారితో జిల్లా కేంద్రానికి రాకపోకలు పెరిగాయి. ఈ నేపథ్యంలో హోటల్ వ్యాపారం బాగా అభివృద్ధి చెందుతున్నది. ఈ రంగంలో రాణించేందుకు ఆసక్తి చూపుతున్న మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది.

స్వశక్తి సంఘాలకు ప్రాధాన్యత

మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాచరణ చేస్తున్నది. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాల్టీలలో మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకు స్వశక్తి సంఘాల మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. పది మంది మహిళలు కలిసి క్యాంటీన్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. అందుకు బ్యాంకు ద్వారా అవసరం మేరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నది. రుణాలు తీసుకున్న మహిళలు తిరిగి చెల్లించడంలో ముందువరసలో ఉన్నారు. వారికి రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు సైతం సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆధునిక పరికరాలు, అన్ని హంగులతో నాణ్యమైన టిఫిన్స్, భోజనం ప్రజలకు అందించేలా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ రూపకల్పన చేస్తున్నది. తొలి విడుతలో జిల్లాలో నాలుగు క్యాంటీన్లను ఏర్పాటు చేసి, తద్వారా వాటి నిర్వహణ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి మరిన్ని ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా వేములవాడ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించేలా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది.

ప్రణాళికలు రూపొందిస్తున్నాం

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలన్న ఉద్దేశంతో కొత్తగా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా స్వశక్తి సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలిప్పిస్తాం. జిల్లాలో నాలుగు క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆసక్తి చూపే మహిళలకు కేటాయిస్తాం.

– శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

వీర్నపల్లి, జూలై 7: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బంజారా సేవాలాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ సురేశ్‌నాయక్ పనులను పరిశీలించి, మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్యే కేటీఆర్ చొరవతో ఎల్లారెడ్డిపేట నుంచి మర్రిమడ్ల వరకు రోడ్డు, వంతెనలు నిర్మాణానికి ₹26 కోట్లు మంజూరు చేసిందన్నారు. పలు కారణాలతో మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం ₹4కోట్లతో పనులు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ మల్లేశం, మాజీ సర్పంచ్ పాటి దినకర్, మాజీ ఉప సర్పంచ్ బోయిని రవి, తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమంపై పట్టింపేది?

- ప్రజల సమస్యల కంటే.. ప్రతిపక్ష ఎమ్మెల్యేల చేరికలపైనే కాంగ్రెస్ దృష్టి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ జూలై7: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆరోపించారు. ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయడం కంటే.. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపైనే ప్రభుత్వం ఎక్కువగా దృష్టిపెట్టిందన్నారు. వేములవాడ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదన్నారు. పరిపాలన మొత్తం ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపైనే ఉండడం దురుదృష్టకరమన్నారు. కనీసం వారికి అభివృద్ధి నిధులు కేటాయించకపోవడం అప్రజాస్వామికం అని మండిపడ్డారు. ప్రజలందరూ గమనిస్తున్నారని సూచించారు. ఈ నెల 9న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వేములవాడ నియోజకవర్గంలో పర్యటిస్తారని, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో నాయకులు కుమ్మరి శంకర్, రేగుల మల్లికార్జున్, సంతోష్‌బాబు, సత్తయ్య, కృష్ణస్వామి, గంగాధర్ పాల్గొన్నారు.

మా దైవం.. మా ధైర్యం కేటీఆర్

- మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతోనే గ్రామంలో అభివృద్ధి పనులు చేశాం
- మండెపల్లి మాజీ ఎంపీటీసీ బుస్స స్వప్న-లింగం దంపతులు

మాజీ మంత్రి కేటీఆర్‌తో మండెపల్లి మాజీ ఎంపీటీసీ బుస్స స్వప్న-లింగం దంపతులు

సిరిసిల్ల రూరల్, జూలై 7: తమ గ్రామంలో మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతోనే అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టామని.. మా దైవం..మా ధైర్యం రామన్ననే అని తంగళ్లపల్లి మండలం మండెపల్లి మాజీ ఎంపీటీసీ బుస్స స్వప్న-లింగం దంపతులు స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో తాము చేసిన పనులు, ప్రజలతో మమేకమైన తీరు, మాజీ మంత్రి కేటీఆర్ అందించిన సహకారం, తదితర వివరాలను ఆదివారం వారు వెల్లడించారు. గ్రామంలో 296మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని, 132మందికి చెవిటి మిషన్లు, దివ్యాంగులకు 12స్టిక్స్, ఒక బ్యాటరీ రిక్షా, స్కూటీలు అందించినట్లు తెలిపారు. 43మందిని మోడల్ స్కూల్‌లో చేర్పించడంతోపాటు గురుకుల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులను చేర్పించామన్నారు. యాదవుల కులదైవమైన బీరప్ప గుడికి సర్పంచ్, ఎంపీటీసీల సహకారంతో ₹50లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఓపెన్ జిమ్, ₹6లక్షల ఎల్ఓసీ అందిచినట్లు వెల్లడించారు. నిమ్స్ దవాఖానలో 46మందికి ఫ్రీ ట్రీట్‌మెంట్ అందించామన్నారు. గ్రామంలోని వీధుల్లో మూడు హైమాస్ట్ లైట్లు, ఓ యువకుడికి ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు. పాఠశాలలో ₹2లక్షలతో పనులు చేశామన్నారు. ప్రమాదంలో మృతి చెందిన బంధువినయ్‌కు ₹2లక్షల చెక్కు ఇప్పించామన్నారు. మండెపల్లి గ్రామాభివృద్ధికి ₹15లక్షల ఫండ్ తీసుకువచ్చామని, దివ్యాంగులకు మూడు సైకిళ్లు ఇప్పించామన్నారు. పలు ఇంజినీరింగ్ కళాశాలలో పది మందికి బీటెక్ సీట్లు ఇప్పించామని, ఇవ్వన్నీ మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో చేశామని తెలిపారు. తమకు సహకరించిన మాజీ మంత్రి కేటీఆర్‌కు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

వేములవాడ రూరల్, జూలై 7: వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి, నమిలిగుండుపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో దొంగలుపడ్డారు. చెక్కపల్లిలోని పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి పుస్తెలతాడు, నమిలిగుండుపల్లిలోని మడేలయ్య ఆలయంలో ఆభరణాలు ఎత్తుకెళ్లారు. రెండు రోజుల క్రితం వట్టంలలోని పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి పుస్తెలతాడు, ముక్కుపుడక అపహరించారు. వరుగా దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ టౌన్, జూన్ 7: గురుపూర్ణిమ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. ఇక్కడ షిర్డీ సాయిబాబా సేవా సంస్థ ట్రస్ట్ అధ్యక్షుడు వారాల దేవయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కొనమ్మగారి నాగరాజు, కార్యదర్శి గంప రాజేందర్, కోశాధికారులు కూర రమేశ్, బండారి కుమార్, సంస్థ సభ్యులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

సిరిసిల్ల రూరల్, జులై 7: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి బొల్లారం చంద్రమౌళి పార్టీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎస్సీల వర్గీకరణ జరిగే వరకు పోరాడుతామన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, జూలై 7: బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల (1993-94లో పదో తరగతి) సమ్మేళనం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని రోజంతా ఆనందంగా గడిపారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సమ్మేళనం కలకాలం గుర్తుండిపోయేలా ఫొటో తీయించుకున్నారు. ఇక్కడ ఆనాటి ఉపాధ్యాయులు టీ ఆనందచారి, జీ నాగేంద్రం, ఎం మధుసూదన్, కే నర్సింగరావు ఉన్నారు.

ఈవోకు సన్మానం

వేములవాడ, జూలై 7: రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవో కే వినోద్‌రెడ్డిని టీఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈవో వినోద్‌రెడ్డిని సన్మానిస్తున్న చంద్రశేఖర్

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మార్పీ కార్యాలయ ఆవరణలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన నిర్వహకులు

ఇల్లంతకుంట, జూలై 7: మిడ్డిమిల్స్ వర్కర్స్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడ్డిమిల్స్‌లో మధ్యాహ్నం విద్యార్థులకు కొడిగుడ్డు పెట్టాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఒక గుడ్డు ధర ₹6.30 నుంచి ₹7 వరకు ఉండగా, ప్రభుత్వం తమకు ₹5 మాత్రమే ఇస్తున్నదన్నారు. ప్రభుత్వమే గుడ్లను సరఫరా చేస్తే విద్యార్థులకు తప్పకుండా అందిస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు యూనిఫాంతోపాటు ₹10వేల వేతనం అందించాలన్నారు. నాణ్యమైన బియ్యం అందించాలని కోరారు. పలు పాఠశాలలలో వంటగదులు ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఇక్కడ మిడ్డిమిల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు రాజవ్వ, జుబేదా, దేవక్క, ఐలవ్వ, సుశీల, లావణ్య, లత, కనకవ్వ, గౌరవ్వ, లక్ష్మి, బాలలక్ష్మి, దేవలక్ష్మి, ప్రమోద ఉన్నారు.

కమిటీల నియామకం

వేములవాడ, జూలై 7: నియోజకవర్గంలో సీపీఐ నూతన కమిటీలు వేసినట్లు జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆదివారం తెలిపారు. వేములవాడ పట్టణ కార్యదర్శిగా గాజుల పోశెట్టి, సహాయ కార్యదర్శిగా పెంట శ్రీనివాస్, వేములవాడ రూరల్ మండల కార్యదర్శిగా శ్రీరాముల నర్సయ్య, సహాయ కార్యదర్శిగా పండగ పోషాను నియమించినట్లు తెలిపారు. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు, జిల్లా నాయకులు కేవీ అనసూర్య, క్రాంతికుమార్, శ్రీనివాస్, గణేశ్, చంద్రయ్య, కుమార్ ఉన్నారు.

డెంగీ నిర్ధారణ కాలేదు

దుమాలలో ఇంటింటి సర్వేలో జాగ్రత్తలు సూచిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, జూలై7: దుమాలలో డెంగీతో ఇద్దరు దవాఖానలో చేరినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇప్పటివరకు అలాంటిదేమీ లేదని ప్రజలు భయాందోళనలకు గురికావద్దని వైద్యాధికారులు స్రవంతి, చిరంజీవి తెలిపారు. ఆదివారం దుమాలలో ఇంటింటి సర్వే చేపట్టి వివరాలు వెల్లడించారు. రక్త కణాలు తగ్గగానే అది డెంగీగా పరిగణించవద్దని, అనవసరంగా చికిత్సల కోసం డబ్బుల వృథా చేసుకోవద్దని సూచించారు. తీవ్ర జ్వరం వచ్చి తగ్గనప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త నమూనాలు ఇస్తే డెంగీకి సంబంధించిన రిపోర్ట్ వస్తుందని అది కేవలం జిల్లా హాస్పిటల్ మాత్రమే నిర్ధారిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా 8బృందాలు 604 గృహాల్లో 2,064మంది వివరాలు సేకరించగా ఆరుగురు జ్వరంతో ఉన్నట్లు గుర్తించారు. వారికి పరీక్షలు చేయగా ఎలాంటి డెంగీ నిర్ధారణ కాలేదని, వారికి మందులు అందించినట్లు తెలిపారు. ఇక్కడ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

రాజన్న ఆలయంలో రద్దీ

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, జూలై 7: రాజన్న ఆలయం ఆదివారం రద్దీగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, రాజన్నకు కోడెమొక్కు తీర్చుకున్నారు. క్యూలైన్ల గుండా ఆలయంలోనికి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నను దాదాపు 8వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, రాజన్నకు సుమారు రూ.12లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

మటన్ షాపుల్లో తనిఖీ

- 11 దుకాణాలకు జరిమానా

కార్పొరేషన్, జూలై 7: కరీంనగర్‌లోని మటన్ షాపులను ఆదివారం నగరపాలక సంస్థ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని 11 షాపులను గుర్తించి జరిమానా విధించారు. స్లాటర్ హౌస్‌లో మేకలను వధించాల్సి ఉండగా, నగరంలోని అనేక మటన్ షాపులో ఆ నిబంధనలను పాటించకుండా ఇంటి వద్ద, తమ షాపుల్లోనే మేకలను వధిస్తున్నారు. దీనిపై గతంలో అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి, జరిమానా విధిస్తూ వస్తున్నారు. కాగా, నగరంలోని మటన్ షాపు ల్లో పూర్తిస్థాయిలో తనిఖీలు చేయాలని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం చేపట్టిన తనిఖీల్లో నిబంధనలు పాటించని మానస, మల్లేశ్, మధు, ఐల య్య, పోచయ్య, బీరన్న, మారుతి, అంజన్న, ఎండీ సమీర్, షనవాజ్, కనకయ్య షాపులకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం రూ.40,500 జరిమానా వసూలు చేశారు. కార్యక్రమంలో నగర పాలక పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కమాన్‌చౌరస్తా, జూలై 7: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ వివేకానంద హైస్కూల్‌లో వైరాగ్యం ప్రభాకర్ రచించిన 'జీవన తత్వ గీత - నిత్య చైతన్య ప్రదాత భగవద్గీత' పుస్తకాన్ని కీర్తి పురస్కార గ్రహీత గన్నమరాజు గిరిజామనోహర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యక్తిత్వ వికాసంలో పొందిన గెలుపును ఆస్వాదించే తీరును తెలియ జెప్పే మానవ హిత గ్రంథం భగవద్గీత అని, ఇది మత గ్రంథం కాదన్నారు. దాస్యం సేనాధిపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉట్నూరు ఎంపీడీవో మాడుగుల మురళీధరశర్మ పుస్తక పరిచయం చేశారు.

ప్రధాన అర్చకుడికి సన్మానం

వేములవాడ టౌన్, జూన్ 6: విశ్వజ్యోతి విజ్ఞానసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన వైదిక జ్యోతిష సమ్మేళనంలో వేములవాడ రాజన్న ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రగిరి శరత్‌శర్మను సన్మానించారు. సమస్యలు, పరిష్కారాలపై సమగ్రంగా వివరించిన శరత్‌శర్మను ప్రముఖ జ్యోతిష పండితులు, నిర్వాహకులు సత్కరించారు. ఇక్కడ కంచికామకోటి సర్వజ్ఞపీఠ ఆస్థాన సిద్ధాంతి లక్కావఝుల విజయసుబ్రహ్మణ్య సిద్ధాంతి, పుచ్చ శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీకాంతశర్మ, తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయ ప్రధానార్చకుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేందర్‌రెడ్డి

మహేందర్‌రెడ్డి

వేములవాడ, జూన్ 7: పీఆర్‌టీయూ తెలంగాణ రాజన్నసిరిసిల్ల జిల్లా ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శిగా కోమటిరెడ్డి మహేందర్‌రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఇల్లంతకుంట మండలం అనంతారంలో పని చేస్తున్న మహేందర్‌రెడ్డిని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరికృష్ణకు మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సంఘం పటిష్టతకు పాటుపడుతానని చెప్పారు.

బాధితులకు టర్పాలిన్లు అందజేస్తున్న నరేశ్‌నాయక్

టర్పాలిన్లు అందజేత

కోనరావుపేట, జూలై 7: మరిమడ్లకు చెందిన కొమ్ము మణెమ్మ, ఇండ్ల దేవేంద్ర, తిక్కల అన్నపూర్ణ, మాంకాళి సుమలత, కుమ్మరి దిలీప్ ఇల్లు పైకప్పు పాక్షికంగా ధ్వంసం కాగా, లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌నాయక్ టర్పాలిన్లు అందజేశారు. సుమారు రూ.8వేల విలువైన టర్పాలిన్లు బాధితులకు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ శ్రీనాథ్‌నాయక్, కుమ్మరి దిలీప్, తిక్కల రాజు, జింక రమేశ్ ఉన్నారు.

పుస్తెలతాడు అపహరణ

రాంనగర్, జూలై 7: కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌లో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడ నుంచి దుండగులు పుస్తెలతాడు లాక్కొని పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపూర్‌కు చెందిన జాగిరి సుభద్ర తన ఇంటి అవతలి వైపు ఉన్న మణెమ్మ ఇంటికి వెళ్లి వస్తుండగా ఫోన్ మాట్లాడుకుంటూ వెంబడించిన ఒక వ్యక్తి ఆమె మెడ నుంచి రెండున్నర తులాల పుస్తెలతాడు లాక్కొని మరో వ్యక్తి సాయంతో బైక్‌పై పరారయ్యాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై వెంబడించినా ఫలితం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని ఆధారాల కోసం ప్రయత్నించారు. సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

భగవద్గీత పాఠ్యాంశాల్లో చేర్చాలని వినతి

కమాన్‌చౌరస్తా, జూలై 7 : భగవద్గీతను పాఠశాల, కళాశాల స్థాయిల్లో పాఠ్యాంశంగా చేర్చాలని గీతా భక్తసమాజం ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేశారు. నగరంలోని అశోక్‌నగర్ మలయాళ సద్గురు గీతామందిరం మఠాధిపతి విష్ణుసేవానందగిరి స్వామి ఆధ్వర్యంలో గీతా భక్త సమాజం నేతృత్వంలో ఆదివారం వైశ్య భవన్‌లో కలశ, గణపతి పూజ, శ్రీకృష్ణుడికి అభిషేకం, అనంతరం సంపూర్ణ భగవద్గీత సహస్రగళ పారాయణం నిర్వహించారు. భగవద్గీతను పాఠ్యాంశాల్లో చేర్చాలని నిర్ణయం తీసుకున్నారు. బండి సంజయ్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ సంపూర్ణానందగిరిస్వామి, విష్ణుసేవానందగిరిస్వామి, చిదానందగిరిస్వామి, జగదీశ్వరానందగిరిస్వామితోపాటు మహేశ్వరశర్మ ఉన్నారు.

ఆర్థిక సాయం

బోయినపల్లి, జూలై 7: